సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
ఆదివారం । 11 । మే । 2025





## ఎఫ్‌సీ చేయించుకోండి!
వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు తెరుస్తున్నారంటే రవాణాశాఖ కార్యాలయాల వద్ద విద్యాసంస్థల బస్సుల సందడి కనిపిస్తుంది.
-10లో



## అన్నమయ్య కోసం.. కదిలిన వారసులు
పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల సంకీర్తనలు విశ్వవ్యాప్తం చేసేందుకు అన్నమయ్య 12వ తరం వారసులు నడుం బిగించారు.
-10లో

## వాతావరణం
గరిష్టం/కనిష్టం
40.2/26.2
జిల్లాలో శనివారం 26.2 – 40.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 4.08 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
-కడప అగ్రికల్చర్

## న్యూస్‌రీల్

### సీఎస్ఎస్ఎన్ రెడ్డికి డీఐఈఓగా ఉద్యోగోన్నతి
**పాయకాపురం(విజయవాడరూరల్):** ఎన్టీఆర్ జిల్లా డైరెక్టర్ ఆఫ్ ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ ఇన్‌చార్జిగా పని చేస్తున్న సీఎస్ఎస్ఎస్ఎన్ రెడ్డిని ప్రభుత్వం వైఎస్సార్ కడప జిల్లా డీఐఈఓగా ప్రమోషన్ ఇచ్చి బదిలీ చేసింది. ఆయన పాయకాపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా, జిల్లా ఒకేషనల్ ఆఫీసర్‌గా పని చేశారు. ప్రస్తుతం ఆయన స్థానంలో ఏలూరు నుంచి బి.ప్రభాకర్‌ను ప్రభుత్వం ఎఫ్ఏసీగా నియమించింది.

### మెగా డీఎస్సీకి ఉచిత శిక్షణ
**కడప కోటిరెడ్డిసర్కిల్:** వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మెగా డీఎస్సీకి ఆన్‌లైన్ ద్వారా ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు కడప బీసీ స్టడీ సర్కిల్ సంచాలకులు డాక్టర్ రాజ్యలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. టెట్‌లో అర్హత సాధించిన జిల్లా వాసులైన బీసీ, ఈబీసీ, ఎస్సీ, ఎస్టీ కేటగిరీలకు చెందిన ఎస్‌జీటీ, స్కూలు అసిస్టెంట్ అభ్యర్థులు ఇందుకు అర్హులని పేర్కొన్నారు. ఉచిత శిక్షణకు టెట్ పరీక్షలకు సంబంధించిన మార్కుల జాబితా, నేటివిటీ, కుల సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, 2 పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు జతచేసి కడపలోని పాత రిమ్స్‌లోగల బీసీ భవన్ రెండవ అంతస్తులోని తమ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలన్నారు. ఇతర వివరాలకు 98499 19221, 99664 18572 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

### 12న ప్రతిభా అవార్డుల ప్రదానోత్సవం
**కడప వైఎస్ఆర్ సర్కిల్:** రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల వెల్లడించిన పది, ఇంటర్మీడియట్ విభాగాల్లో అత్యధిక మార్కులు సాధించిన దూదేకుల విద్యార్థులకు ఈ నెల 12న నగరంలోని ఐఎంఏ హాల్‌లో ప్రతిభా అవార్డుల ప్రదానోత్సవం నిర్వహిస్తున్నట్లు ఏపీ నూర్ బాషా దూదేకుల, బీసీ, ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గగ్గుటూరి చిన్న రాజా పేర్కొన్నారు. శనివారం నగరంలోని దూదేకుల సంక్షేమ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ సంఘంతో పాటు కడప నూర్ బాషా దూదేకుల సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్మీడియట్‌లో 950 మార్కులకు పైగా సాధించిన విద్యార్థులకు అలాగే పదవ తరగతిలో 560 మార్కులు పైగా సాధించి దరఖాస్తు చేసుకున్న వారికి అందజేయడం జరుగుతుందన్నారు. ఇతర వివరాలకు 94406 77839, 9441276127 నెంబర్లను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు సుంకేసుల బాషా, నాయకులు ఖాదరయ్య, ఓబులేసు, కమాల్ బాషా పాల్గొన్నారు.

### 12న ధర్నా


డీఆర్ఓకు నోటీసును అందచేస్తున్న యూటీఎఫ్ నేతలు

**కడప ఎడ్యుకేషన్:** పాఠశాల విద్యాశాఖ చేపడుతున్న పాఠశాలల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియతో పాటు ఏ విధమైన స్పష్టమైన జీఓలు లేకుండానే రోజుకో ఆలోచనతో జరుగుతున్న ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ అందరిలో తీవ్ర ఆందోళన కలిగిస్తోందని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని జిల్లా రెవిన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడును కలిసి ధర్నాకు సంబంధించిన నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీఓ 117 రద్దు చేయాలన్నారు. అన్ని ప్రాథమిక పాఠశాలల్లో 1:20 నిష్పత్తి ప్రకారం ఉపాధ్యాయులను నియమించాలని, అన్ని మోడల్ ప్రైమరీ స్కూల్స్‌లో 5 తరగతులు బోధించడానికి 5 మంది టీచర్లను నియమించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి సమస్యలను పరిష్కరించాలని లేకుంటే 12న డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపడతామని తెలిపారు.

# బుక్ చేస్తున్నారు!

**సీఎంఓ డైరెక్షన్... కలెక్టరేట్ యాక్షన్..!**
- టీడీపీ మహానాడు కోసం ముందస్తు బుకింగ్
- కల్యాణ మండపాలు, కళాశాలలను వదలని వైనం
- పోలీస్, రెవెన్యూ సిబ్బంది సహకారంతో ముందే ఒప్పందం
- లాడ్జిలు, వసతి భవనాలు స్వాధీనం చేసుకుంటున్న ప్రభుత్వ యంత్రాంగం







**సాక్షి ప్రతినిధి, కడప:** ముఖ్యమంత్రి కార్యాలయం దిశానిర్దేశం చేయగా.. కలెక్టరేట్ రంగంలోకి దిగింది. కడప గడపలో ప్రభుత్వ, ప్రైవేటు లాడ్జిలు, కళ్యాణమండపాలు, వసతి భవనాలు, కళాశాల హాస్టల్స్ ఇలా ఒక్కటి వదలకుండా బుక్ చేస్తోంది. ఈ నెల 27,28,29 తేదీల్లో తెలుగుదేశం పార్టీ మహానాడు జరగనుంది. ఆ మూడు రోజులు ఇతరులెవ్వరికీ రూములు ఇవ్వకూడదంటూ లాడ్జీల యాజమానులకు ఆర్డర్ జారీ చేస్తోంది.

- జిల్లా కేంద్రమైన కడప రింగురోడ్డులో ఉన్న పబ్బాపురం–చెర్లోపల్లె టీచర్స్ హౌస్ బిల్డింగ్ సొసైటీలో మహానాడు నిర్వహించేందుకు నిర్ణయించారు. ఆ మేరకు క్షేత్రస్థాయిలో భూమి చదును కార్యక్రమం కొనసాగిస్తున్నారు. మహానాడు వేదిక ఏర్పాటుకు కావాల్సిన చర్యలు ఓ వైపు కొనసాగుతుండగా, మరోవైపు టీడీపీ నేతలకు వసతి సమకూర్చే చర్యలకు స్వయానా ప్రభుత్వ అధికారులు సిద్ధమవడం గమనార్హం. క్షేత్రస్థాయిలో అవకాశం ఉన్న ప్రతి వసతి గృహాన్ని పరిశీలించడం, ఆపై బుక్ చేయడంలో అటు రెవెన్యూ, ఇటు పోలీసు అధికారులు నిమగ్నమయ్యారు.

**ప్రైవేటు కళాశాలలపై ప్రత్యేక దృష్టి....**
కడప రింగు రోడ్డులో మహానాడు ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు కళాశాలలు, కార్పొరేట్ కళాశాలల హాస్టల్ భవనాలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఎటూ వేసవి సెలవులు నేపథ్యంలో ఆయా కళాశాలల హాస్టల్ భవనాలను అదుపులో ఉంచుకుంటే వందలాది మంది ఒక్కోక్క భవనంలో వసతి కల్పించవచ్చునే దిశగా ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఇదివరకే జిల్లాలో ఇలాంటి చర్యలకు ఆయా ప్రాంతాలల్లో టీడీపీ నాయకులు, ఎమ్మెల్యేలు తలమునకలయ్యారు. తాజాగా ప్రభుత్వ యంత్రాంగం రంగ ప్రవేశం చేసింది. సీఎంఓ ఆదేశాల మేరకు కలెక్టరేట్ వర్గాలు జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ప్రైవేటు వసతి గృహాలు, లాడ్జీలు, కళాశాలలను అదుపులోకి తీసుకుంటున్నారు. ఇదివరకే ఎవరికైనా అద్దెకిచ్చినా క్యాన్సిల్ చేయాలని..ఆ మూడు రోజులు తమకు అప్పగించాల్సిందేనని హుకుం జారీ చేస్తున్నారు. ప్రభుత్వ అధికారులు రంగ ప్రవేశం చేయడంతో ఆయా ప్రాంతాల్లో యజమానులు డైలమాలో పడ్డట్లు సమాచారం. విద్యాసంస్థలు నోరెత్త కుండా అప్పగించే దిశగా ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం.

**కడపలో నిర్వహణపై డైలమా?**
మరోవైపు టీడీపీ మహానాడు కడపలో నిర్వహణపై ఇప్పటికీ సందిగ్ధం కొనసాగుతోంది. జిల్లాలో తెలుగుతమ్ముళ్ల మధ్య ఉన్న విభేదాలతో పలు పర్యాయాలు పర్యటించి స్థల ఎంపిక చేపట్టారు. అనువైన స్థలాన్ని ఎంపిక చేసినప్పటికీ గుంటూరు–కృష్ణా జిల్లాల్లోనే మహానాడు చేపట్టాలని అక్కడి నాయకులు పట్టుబడుతున్నట్లు సమాచారం. మరోవైపు ఇండియా–పాకిస్తాన్ ఉద్రిక్తతలు తీవ్రమయ్యే నేపథ్యంలో మహానాడుకు నిర్వహణకు అభ్యంతరం చెప్పే అవకాశం లేకపోలేదు. ఈ పరిస్థితుల్లో ఈనెల 14న సీఎం చంద్రబాబు నేతృత్వంలో మహానాడు నిర్వహణపై సమీక్ష సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. మహానాడు మూడు రోజులు పాటు నిర్వహించాలా, ఒక్క రోజుతో ముగించాలా? ఒక్కరోజు అయితే కడపలో నిర్వహించడం అవసరమా? ఇలాంటి ప్రశ్నలన్నంటికీ చంద్రబాబు నిర్వహించే ఆ సమావేశంలో స్పష్టత వచ్చే అవకాశం ఉందని పలువురు నేతలు చెబుతున్నారు.

# దర్యాప్తు నైపుణ్యాలను మెరుగుపర్చడమే లక్ష్యం

- నేరస్థులకు శిక్ష పడటంలో శాస్త్రీయ పద్ధతిలో ఆధారాల సేకరణ కీలకం
- ఎస్పీ ఈ.జి అశోక్ కుమార్




మాట్లాడుతున్న ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్

**కడప అర్బన్:** నేరం చేసిన వారు ఎట్టి పరిస్థితులలో చట్టం నుంచి తప్పించుకోకూడదని, వారికి శిక్షపడాలంటే ఆధారాల సేకరణలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకోవాలని ఎస్పీ అశోక్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం స్థానిక 'పెన్నార్'పోలీస్ కాన్ఫరెన్స్ హాలులోవర్క్ షాప్ నిర్వహించారు. పోలీసు అధికారులకు, సిబ్బందికి ప్రభుత్వాస్పత్రి వైద్యులు, పబ్లిక్ ప్రాసి క్యూటర్లకు ఫోరెన్సిక్ ఆధారాల సేకరణ, నిర్వహణ, చైన్ ఆఫ్ కస్టడీ మార్గదర్శకాలు, నేర పరిశోధనలో అనుసరించవలసిన విధి విధానాలు, ఆధునిక శాస్త్రీయ ప్రమాణాలు తదితర అంశాలపై ఫోరెన్సిక్ నిపుణులతో ప్రత్యేక శిక్షణ ఇచ్చా రు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ దర్యాప్తు అధికారులు నేరం జరిగిన చోటును ఏ విధంగా రక్షణ కల్పించాలి, నేర స్థలంలో డి.ఎన్.ఏ, రక్త నమూనాలు, మానవ అవయవాలు, నార్కోటిక్స్, మత్తు పదార్థాలు, వివిధ రకాల విషాలు, ఆడియో, వీడియో, వివిధ పత్రాలు, భౌతిక సాక్ష్యాధారాలను ఏవిధంగా సేకరించాలి తదితర అంశాలపై వర్క్ షాప్‌లో ప్రముఖ ఫోరెన్సిక్ నిపుణులతో శిక్షణ తరగతులు నిర్వహించామన్నారు. నేరస్తులకు కోర్టుల్లో శిక్షలు పడితేనే నేరాలు తగ్గుతాయన్నారు. ఆ దిశగా అత్యంత అధునాతన శాస్త్రీయ ప్రమాణాలు, పద్ధతులు అందిపుచ్చుకోవాలన్నారు. కేసులు దర్యాప్తు చేపట్టి కేసులు విచారణ ప్రారంభమైన సమయంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ల సమన్వయంతో దోషులకు శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా శాస్త్రీయ పద్ధతిలో కేసుల దర్యాప్తు ఉండాలన్నారు. సేకరించిన సాక్ష్యాధారాలను ఏ విధంగా భద్రపరచాలి.. భద్రపరిచిన వాటిని ఫోరెన్సిక్ ల్యాబ్ లకు పంపే సమయంలో ఎలా ప్యాకింగ్ చేయాలి. సదరు ఆధారాల ద్వారా ఎలాంటి సమాచారం కోరుకుంటున్నామో ఎలా తెలియజేయాలి అనే అంశాలను గురించి నిపుణులు విపులంగా వివరించారు. సాక్ష్యాల సేకరణలో చేయకూడని పొరపాట్లు గురించి విశదీకరించారు. నిపుణులు తెలియజేసిన అంశాలకు గురించి, పోలీస్ అధికారులు వారికున్న సందేహాలను అడిగి నివృత్తి చేసుకున్నారు. అనంతరం వర్కు షాపులో పాల్గొన్న ఫోరెన్సిక్ నిపుణులు హాసిం బాషా, డా.ఎం.కిషోర్ కుమార్ రెడ్డి, కుమారస్వామి, శ్యాంప్రసాద్ లను ఎస్పీ అశోక్ కుమార్ సత్కరించి, జ్ఞాపికలను బహూకరించారు. అదనపు ఎస్.పి కె.ప్రకాష్ బాబు, డీడీ ప్రాసిక్యూషన్స్ ఎస్.ఖదీరున్నీసా, డీఎస్పీలు సుధాకర్, జి.వెంకటేశ్వ ర్లు, భావన, రాజేంద్రప్రసాద్, బాలస్వామి రెడ్డి, భవాని, డీసీఆర్‌బీ సీఐ ఈశ్వర్ రెడ్డి, ఎస్.బి ఇన్‌స్పెక్టర్ దారెడ్డి భాస్కర్ రెడ్డి, కోర్ట్ మానిటరింగ్ సెల్ ఇంచార్జ్ సీఐ వినయ్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పాల్గొన్న పోలీసు అధికారులు, సిబ్బంది

# దేశం కోసం ప్రాణ త్యాగానికి సిద్ధం

- మాజీ ఎమ్మెల్యే రాచమల్లు
- మురళీ నాయక్ చిత్రపటానికి నివాళి



మురళీనాయక్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి

**ప్రొద్దుటూరు:** దేశం కోసం అవసరమైతే ప్రాణత్యాగానికైనా సిద్ధంగా ఉన్నానని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్ రెడ్డి అన్నారు. ప్రొద్దుటూరులోని తన స్వగృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భారత్ – పాకిస్థాన్ యుద్ధంలో వీర మరణం పొందిన జవాన్ మురళీనాయక్ చిత్రపటానికి శనివారం రాచమల్లు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మురళీనాయక్ యుద్ధంలో మరణించి కోట్లాదిమంది భారతీయుల గుండెల్లో జీవించి ఉన్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ దేశం మనకేమి ఇచ్చింది అనే దాని కంటే దేశానికి మనం ఏమిచ్చామని ప్రశ్నించుకోవాలన్నారు. ఉగ్రవాదులు ఉద్దేశ్యపూర్వకంగానే మత విద్వేషాలను రెచ్చగొట్టేందుకే పహల్గాంలో దాడులకు తెగబడ్డారన్నారు. మనది భిన్నత్వంలో ఏకత్వమైన దేశమన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ మినహా ఏ ఒక్కరూ ముస్లింలను తప్పుపట్టడం లేదన్నారు.

**నెల పింఛన్ జాతీయ నిధికి చెల్లిస్తా..**
ప్రస్తుతం జరుగుతున్న యుద్ధ వాతావరణంలో మన దేశానికి మనమందరం అండగా నిలవాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాచమల్లు శివప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వం పిలుపునిస్తే ర్యాలీలను అర్పడం, సంఘీభావం తెలపడం వంటి కార్యక్రమాలను చేయాలని కోరారు. తనవంతు సాయంగా మాజీ ఎమ్మెల్యేను అయిన తనకు వచ్చే నెల పింఛన్ మొత్తాన్ని జాతీయ నిధికి ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ జేష్టాది శారత, మున్సిపల్ వైస్ చైర్మన్ ఆయిల్ మిల్లు ఖాజా, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షులు భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, ప్రొద్దుటూరు, రాజుపాళెం మండలాల అధ్యక్షులు మార్తల ఓబుళరెడ్డి, బాణా వెంకటకొండారెడ్డి, కౌన్సిలర్లు రాగుల శాంతి, గుర్రం లావణ్య, సత్యం, ముదిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, అనిల్, ఆల్ ఇండియా రేడియో మాజీ డైరెక్టర్ నాగులారపు విజయసారథి, గోపవరం ఉప సర్పంచ్ రాఘవరెడ్డి, నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షులు దేశ్ రామోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**వీరుడి త్యాగం దేశం మరవదు**
**రాజంపేట టౌన్:** ఉగ్రవాదాన్ని తుదిముట్టించడంలో భాగంగా భారతదేశం చేపట్టిన సింధూర్ ఆపరేషన్‌లో మన తెలుగుబిడ్డ మురళీనాయక్ త్యాగం దేశం ఎప్పటికి మరవదని ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి తెలిపారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం మురళీనాయక్ చిత్రపటానికి మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆకేపాటి విలేకరులతో మాట్లాడారు. మురళీనాయక్‌కు చిన్నప్పటి నుంచి గుండెల నిండా దేశభక్తి ఉండేదన్నారు. అదే ఆయనను సైనికుడిని చేసిందని తెలిపారు. దేశాన్ని కాపాడేందుకు అహర్నిశలు శ్రమిస్తూ వచ్చిన మురళీనాయక్ సింధూర్ ఆపరేషన్‌లో వీరోచిత పోరాటం చేసి అసువులుబాయడం బాధాకరమన్నారు. భారతదేశాన్ని కాపాడేందుకు సైనికులు చేసే త్యాగ్యం గురించి ఎంత చెప్పినా తక్కువే అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వివిధ విభాగాల కన్వీనర్లు డి.భాస్కర్‌రాజు, పాపినేని విశ్వనాథ్‌రెడ్డి, రేవరాజు శ్రీనివాస్ రాజు, డీలర్ సుబ్బరామిరెడ్డి, వడ్డే రమణ, దయానంద, మిర్యాల సురేఖ తదితరులు పాల్గొన్నారు.

# డీఎస్సీ రోస్టర్ ఇలా!



డీఎస్సీకి కోచింగ్ తీసుకుంటున్న అభ్యర్థులు

**కడప ఎడ్యుకేషన్:** డీఎస్సీ పరీక్షకు సమయం దగ్గరపడుతోంది. ఉపాధ్యాయ నియామకాలకు సంబంధించిన పోస్టుల ప్రక్రియలో భాగంగా రోస్టర్, రిజర్వేషన్లను ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. ఉమ్మడి కడపజిల్లాలో 705 పోస్టులకు జిల్లా పరిషత్తు, మండల పరిషత్తు, కార్పొరేషన్, మున్సిపాలిటి పరిధిలోని పాఠశాలలకు చెందిన పోస్టులకు సంబంధించి సబ్జెక్టుల వారీగా, కులల వారీగా పోస్టుల వివరాలను వెల్లడించారు. దీంతోపాటు ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్‌కి సంబంధించి ఆమోదం పొందడంతో ఆ వర్గానికి సంబంధించి ఎస్సీ ఏ, బీ, సీగా పోస్టులను విడివిడిగా ప్రకటించారు.

**దరఖాస్తు ప్రక్రియలో ఇప్పటికీ ఇబ్బందులే..**
అసలే డీఎస్సీ పరీక్షలకు గడవు తక్కువగా ఉందని ఆందోళన చెందుతున్న అభ్యర్థులకు దరఖాస్తుల్లో తలెత్తే సమస్యలు చికాకు పడుతున్నాయి. లెక్కలేనని నిబంధనలు.. సర్టిఫికెట్ల అప్‌లోడ్ చేయడం తదితర సమస్యలతో పాటు మరికొన్ని సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయని అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బీటెక్, బీఈడీ చేసిన అభ్యర్థులు టెట్ రాసి అర్హత మార్కులు సాధించారు. తాజా డీఎస్సీకి దరఖాస్తు చేసుకుంటే అర్హత లేదని చూపిస్తోందని పలువురు అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**మున్సిపాలిటీ పరిధిలో వివరాలు ఇలా...**

| సబ్జెక్టు | బీసీ ఏ | బీ | సీ | డీ | ఈ | ఈడబ్ల్యూఎస్ | ఓసీ | ఎస్సీఎ | బీ | సీ | ఎస్టీ | మొత్తం |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| ఎస్ఏ ఇంగ్లిష్ | – | – | – | – | – | – | – | 1 | – | – | – | 01 |
| ఎస్ఏ హిందీ | – | – | – | – | – | – | 1 | – | – | – | – | 01 |
| బీఎస్ టీఎం | – | – | – | – | – | – | 1 | 1 | – | – | – | 02 |
| మ్యాథ్స్ యూఎం | – | – | – | – | – | – | 1 | – | – | – | – | 01 |
| పీహెచ్ ఈడీఎస్ | – | – | – | – | – | – | 1 | – | – | – | – | 01 |
| సోషియల్ టీఎం | – | – | – | – | – | – | 1 | – | – | – | – | 01 |
| ఎస్‌జీటీ తెలుగు | 2 | 2 | – | 1 | 1 | 2 | 8 | – | 1 | 2 | 2 | 21 |
| మొత్తం | 2 | 2 | 0 | 1 | 1 | 2 | 13 | 2 | 1 | 2 | 2 | 28 |

**ఎస్‌జీటీ ఉర్దూ మీడియం క్యారీ ఫార్వర్డ్ ఖాళీల వివరాలు...**

| రోస్టర్ | జెడ్పీ, ఎంపీపీ | మున్సిపాలిటి | కార్పొరేషన్ | మొత్తం |
|---|---|---|---|---|
| బీసీ ఏ | 3 | 1 | 1 | 5 |
| బీసీ సీ | – | 1 | – | 1 |
| బీసీ డీ | 3 | 1 | 1 | 5 |
| ఎస్సీ ఏ | – | 1 | – | 1 |
| ఎస్సీ బీ | 2 | 1 | – | 3 |
| ఎస్సీ సీ | 5 | 1 | – | 6 |
| ఎస్టీ | 3 | 1 | – | 4 |
| మొత్తం | 16 | 7 | 2 | 25 |

**మొత్తం పోస్టుల వివరాలు**

| సామాజిక వర్గం | జెడ్పీ, మండల పరిషత్తు | కార్పొరేషన్ | మున్సిపాలిటి | మొత్తం |
|---|---|---|---|---|
| ఓసీ | 255 | 12 | 17 | 284 |
| బీసీ ఏ | 47 | 03 | 04 | 54 |
| బీసీ బీ | 58 | 02 | 01 | 61 |
| బిసి సీ | 06 | 01 | 0 | 07 |
| బీసీ డీ | 47 | 02 | 01 | 50 |
| బీసీ ఈ | 23 | 01 | 00 | 24 |
| ఎస్సీ ఏ | 08 | 04 | 05 | 17 |
| ఎస్సీ బీ | 41 | 02 | 01 | 44 |
| ఎస్సీ సీ | 52 | 03 | 0 | 55 |
| ఎస్టీ | 39 | 03 | 01 | 43 |
| ఈడబ్ల్యూఎస్ | 63 | 02 | 01 | 66 |

**కార్పొరేషన్ పరిధిలో వివరాలు ....**

| సబ్జెక్టు | బిసిఎ | బి | సి | డి | ఈ | ఈడబ్ల్యూఎస్ | ఓసీ | ఎస్సీఎ | బి | సి | ఎస్టీ | మొత్తం |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| ఎస్ఏ ఇంగ్లీస్ | – | – | – | – | – | – | 1 | 1 | – | – | – | 02 |
| హిందీ | – | – | – | – | – | – | 1 | – | – | – | – | 01 |
| సంస్కృతం | – | – | – | – | – | – | 1 | – | – | – | – | 01 |
| ఉర్దూ | – | – | – | – | – | – | 1 | – | – | – | – | 01 |
| మ్యాథ్స్ టీఎం | – | – | – | – | – | – | 1 | – | – | – | – | 01 |
| పిడి | 1 | – | – | – | – | – | 2 | 1 | – | – | – | 04 |
| సోసియల్‌టిఎం | – | – | – | – | – | – | 1 | – | – | – | – | 01 |
| ఎస్‌జిటి తెలుగు | 1 | 1 | – | – | – | 1 | 6 | 1 | 1 | – | 1 | 12 |
| ఎస్‌జిటి ఉర్దూ | 1 | – | – | – | – | – | 3 | – | 1 | – | 1 | 06 |
| మొత్తం | 3 | 1 | 0 | 0 | 0 | 1 | 17 | 3 | 2 | 0 | 2 | 29 |

**ప్రభుత్వ, జెడ్పీ, ఎంపీపీ స్కూళ్ల పరిధిలో ....**

| సబ్జెక్టు | బిసిఎ | బీ | సీ | డీ | ఈ | ఈడబ్ల్యూఎస్ | ఓసీ | ఎస్సీఎ | బీ | సీ | ఎస్టీ | మొత్తం |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| ఎస్ ఇంగ్లిష్ | 5 | 8 | 1 | 6 | 3 | 8 | 30 | 1 | 5 | 6 | 5 | 78 |
| హిందీ | 1 | 1 | – | 2 | 1 | 2 | 5 | – | 1 | 2 | 1 | 16 |
| తెలుగు | 2 | 2 | 1 | 1 | 1 | 2 | 11 | 1 | 2 | 1 | 2 | 26 |
| ఉర్దూ | 1 | – | – | – | – | – | 4 | 1 | – | – | – | 06 |
| బీఎస్ టీఎం | 3 | 5 | 1 | 3 | 2 | 5 | 20 | 1 | 2 | 4 | 3 | 49 |
| బీఎస్ ఉర్దూ | – | – | – | – | | 1 | 1 | – | – | – | – | 02 |
| మ్యాథ్స్ టీఎం | 3 | 3 | – | 4 | 1 | 4 | 19 | – | 3 | 3 | 2 | 42 |
| పీడీ | 6 | 6 | 1 | 5 | 3 | 7 | 32 | 1 | 6 | 5 | 5 | 77 |
| పీఎస్ టీఎం | 2 | 2 | – | 3 | 1 | 3 | 11 | – | 2 | 2 | 2 | 28 |
| పీఎస్‌యూఎం | – | – | – | – | – | – | 1 | – | – | 1 | – | 02 |
| సోషియల్ టీఎం | 4 | 7 | – | 4 | 2 | 6 | 23 | 1 | 3 | 5 | 3 | 58 |
| సోషియల్ ఉర్దూ | – | 1 | – | – | – | 1 | 3 | – | – | – | – | 05 |
| ఎస్‌జీటీ తెలుగు | 16 | 22 | 2 | 14 | 8 | 22 | 89 | 2 | 14 | 17 | 13 | 219 |
| ఎస్‌జీటీ ఉర్దూ | 1 | 1 | – | 2 | 1 | 2 | 6 | – | 1 | 1 | – | 15 |
| మొత్తం | 44 | 58 | 6 | 44 | 23 | 63 | 255 | 8 | 39 | 47 | 36 | 623 |

# రేపు శ్రీదేవరరాయి నల్లగంగమ్మ జాతర





శ్రీదేవరరాయి నల్లగంగమ్మతల్లి, జాతరకు ముస్తాబు అవుతున్న అమ్మవారి ఆలయం

**సంబేపల్లె:** భక్తుల కొంగు బంగారమైన శ్రీదేవరరాయి నల్లగంగమ్మ తల్లి జాతర ప్రతి ఏటా మొలకల పౌర్ణమి రోజు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ఈ ఏడాది సోమవారం ఉదయం నుంచి అమ్మవారి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు జరుగుతాయని, రాత్రి జాతర ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.జాతరకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వారు తెలిపారు. అమ్మవారిని పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు నిత్యం దర్శించుకుంటున్నారు.

**మహా మండపం నిర్మాణం..**
అప్పటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి కృషితో ఆలయ మహామండపం నిర్మాణానికి రూ.1.18కోట్ల నిధులు మంజూరయ్యాయి. 2022 ఫిబ్రవరి 4న మహామండపం నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. పనులు పూర్తికావడంతో ఆలయం సర్వాంగ సుందరంగా తయారైంది.గుడి ప్రాంగణంలో మొక్కలు విరివిగా నాటి వాటిని సంరక్షిస్తున్నారు. ఇటీవలే ఆలయం చుట్టూ కోటి రూపాయల నిధులతో సిమెంట్‌రోడ్లు నిర్మించారు.

**కార్యక్రమాల వివరాలు:** సోమవారం ఉదయం 5 గంటలకు అభిషేకం, ప్రత్యేకపూజలు, మధ్యాహ్నం 12 గంటలకు అన్నదానం. 12:30కి భక్తిగీతాల ఆలాపన, సాయంత్రం 6:30గంటలకు అమ్మవారి పల్లకీ సేవ, రాత్రి 7:30కి అన్నదాన కార్యక్రమం. రాత్రి 8:30 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

## క్లుప్తంగా

### చంద్రారెడ్డికి ప్రతిష్టాత్మక అవార్డు


అవార్డును స్వీకరిస్తున్న చంద్రారెడ్డి

కడప కల్చరల్ : ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి రాష్ట్రాల వీడియో, ఫొటోగ్రాఫర్ల అసోసియేషన్ పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు పద్మప్రియ చంద్రారెడ్డికి ప్రతిష్టాత్మక అవార్డు లభించింది. ఈ మేరకు ఆయనకు తమిళనాడు వీడియో అండ్ ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చంద్రారెడ్డి మాట్లాడుతూ తమిళనాడులోని అన్ని వర్గాల ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్ల సహాయ సహకారాలతో రాష్ట్ర ఉమ్మడి ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్ సంఘాల కోసం అంకిత భావంతో పనిచేస్తామని తెలిపారు. రాష్ట్రంలోని తెలుగు వారు తమిళనాడు వారితో కలిసి నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు.

### మాజీ జెడ్పీ చైర్మన్ సీఎం బలరామిరెడ్డి మృతి


బలరామిరెడ్డి(ఫైల్)

కొండాపురం : ఉమ్మడి కడప జిల్లా మాజీ జెడ్పీ చైర్మన్ సీఎం బలరామిరెడ్డి(88) శనివారం ఉదయం చెన్నైలో తన నివాసంలో మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మండల కేంద్రమైన కొండాపురానికి చెందిన సీఎం బలరామిరెడ్డి 1937 సంవత్సరంలో జన్మించారు. కొండాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయుడిగా పనిచేశారు. తర్వాత 1983 నుంచి 1993 వరకు రెండు పర్యాయాలు ఉమ్మడి కడప జిల్లా జెడ్పీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆయన జెడ్పీ చైర్మన్‌గా ఉన్న సమయంలో మండలంలో ఎంతో మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించారు. ఆయన భౌతికకాయానికి ఆదివారం ఉదయం 10 గంటలకు అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు బంధువులు తెలిపారు.

### బెంగళూరులో సంబేపల్లె యువకుడి మృతి

సంబేపల్లె : ఇందిరా నగర్ కాలనీకి చెందిన సుండుపల్లె సాయి మహేశ్ (21) శుక్రవారం రాత్రి బెంగళూరులో మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. సాయి మహేశ్ బెంగళూరులో ఓ ప్రైవేట్ సంస్థలో పని చేసుకొంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి బెంగళూరులోని బైపనల్లి రైల్వేస్టేషన్ పరిధిలో రైల్వేట్రాక్ దాటుతుండగా రైలు ఢీ కొనడంతో మృతి చెందినట్లు తెలిపారు.

# ఏటీఎస్ వస్తోంది.. ఎఫ్‌సీ చేయించుకోండి!

- ఎఫ్‌సీ కోసం పరుగులు పెడుతున్న విద్యాసంస్థల బస్సులు
- స్కూల్ బస్సులకు ఈ నెల 15 వరకు ఎఫ్‌సీలకు గడువు ఉన్నా..
- మరీ యాజమాన్యాలకు ఫోన్లు చేసి పిలిపిస్తున్న వైనం
- ఇప్పటికే 90 శాతం పైగా స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌ల జారీ
- ఒక్కో వాహనానికి అదనంగా రూ. 2000–2500 వసూలు ?


ఎఫ్‌సీ చేయించుకునేందుకు ఆర్టీఓ కార్యాలయానికి వచ్చిన స్కూల్ బస్సు


ప్రొద్దుటూరు ప్రాంతీయ రవాణాశాఖ కార్యాలయం

ప్రొద్దుటూరు క్రైం : వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు తెరుస్తున్నారంటే రవాణాశాఖ కార్యాలయాల వద్ద విద్యాసంస్థల బస్సుల సందడి కనిపిస్తుంది. మే 15 వరకు ఫిట్‌నెస్ పరీక్షలు చేయించేందుకు వీటికి గడువు ఉంటుంది. ఈ లోగా ఆయా పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులను తరలించే వాహనాలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌లు తీసుకోవాలి. గడువు ముగిసిన తర్వాత ఎఫ్‌సీ చేయించుకుంటే రోజుకు రూ. 10 చొప్పున ఫైన్ కట్టాలి. వేసవి సెలవుల దృష్ట్యా పాఠశాలలు ఉండవు కనుక జూన్ 12 వరకు స్కూల్ బస్సులు బయట తిరగవు. దీంతో మే 15తో ఎఫ్‌సీ గడువు ముగిసినా కూడా విద్యాసంస్థల యాజమాన్యాలు తమ వాహనాలకు జూన్ మొదటి వారంలో ఎఫ్‌సీ చేయించుకునేందుకు ఆర్టీఏ కార్యాలయాలకు తీసుకెళ్తారు. గడువు ముగిసిన రోజులకు గాను రోజుకు రూ. 10 చొప్పున జరిమానా మొత్తాన్ని చెల్లించి పాఠశాలలు తెరిచే నాటికి ఫిట్‌నెస్ పరీక్షలు పూర్తి చేయించుకుంటారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి ఏటా ఇలానే జరుగుతుంది. వేసవి సెలవుల అనంతరం జూన్ 12 నుంచి పాఠశాలలు పునఃప్రారంభమైన తర్వాత ఎఫ్‌సీ చేయించుకోకుండా రోడ్డెక్కే వాహనాలపై ఆర్టీఏ అధికారులు కొరడా ఝుళిపించి కేసులు నమోదు చేస్తారు. ప్రత్యేకంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ఎక్కడికక్కడ స్కూల్ బస్సులను తనిఖీ చేస్తారు. అయితే ఈ సారి ఏప్రిల్ 16 నుంచే ఫిట్‌నెస్ చేయించుకునేందుకు విద్యా సంస్థల వాహనాలు ఆర్టీఓ కార్యాలయాలకు పరుగులు తీశాయి. ఏప్రిల్ చివరి నాటికే సుమారు 80 శాతంపైగా వాహనాలకు ఫిట్‌నెస్ పరీక్షలు చేశారు. గతంలో ఎన్నడూ ఇంత త్వరగా స్కూల్ బస్సులకు ఎఫ్‌సీలు చేయలేదు.

**ఏటీఎస్ పేరుతో పరుగులు పెట్టిస్తున్న వైనం..**

రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్‌లను ఏర్పాటు చేయనుంది. ఇప్పటికే కొన్ని జిల్లాల్లో ఏటీఎస్ (ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్) లు అందుబాటులోకి వచ్చాయి. ఏటీఎస్‌ల ద్వారా వాహనాలను పరీక్షించి ఎఫ్‌సీలు జారీ చేయాలని ప్రభుత్వం వీటిని ఏర్పాటు చేస్తోంది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్రంలో ఈ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఏటీఏస్‌లో మనుషుల ప్రమేయం లేకుండా పూర్తిగా అధునాతన యంత్రాలతో వాహన సామర్థ్య పరీక్షలను నిర్వహిస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఏటీఎస్‌లను ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా కడపలో కూడా ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఎప్పటి నుంచి ఈ సేవలు అందుబాటులోకి వస్తాయనేది తెలియాల్సి ఉంది. అయితే ప్రొద్దుటూరులోని రవాణాశాఖ కార్యాలయ సిబ్బంది మాత్రం ఏటీఎస్ పేరుతో పాఠశాల యాజమాన్యాలను పరుగులు పెట్టిస్తున్నారు. మే 15 తర్వాత కడపలో ఏటీఎస్ సేవలు ప్రారంభం అవుతున్నాయి.. అక్కడికి వెళ్తే ఖర్చు పెరగడంతో పాటు ఎఫ్‌సీ చేయించుకోవడం కష్టం అవుతుంది అంటూ విద్యాసంస్థల యాజమాన్యాలకు కంగారు పెట్టిస్తున్నారు. హోంగార్డులు, కార్యాలయంలో పని చేసే సిబ్బంది, ముఖ్య ఏజెంట్ల ద్వారా స్కూల్ బస్సుల యజమానులకు ఫోన్లు చేయించినట్లు కూడా తెలుస్తోంది. కడపకు వెళ్తే ఖర్చు పెరుగుతుందని, చిన్నపాటి లోపాలున్నా తెలిసిన అధికారులే కనుక చూసీ చూడనట్లు వెళ్తారని వారు ఫోన్ల ద్వారా చెప్పినట్లు సమాచారం. దీంతో స్కూల్ బస్సులన్నీ ఏప్రిల్ 16 నుంచే ఆర్టీఏ కార్యాలయానికి క్యూ కట్టాయి.

**ఆర్టీఓ ఏమంటున్నారంటే..**

కడపలో ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్ వస్తుందని మేము ఎవరికీ చెప్పలేదు. పాఠశాల యాజమాన్యాలే తెలుసుకొని ఉంటారు. అందుకే కడపకు వెళ్లడం భారమని ఇక్కడే ముందుగానే ఎఫ్‌సీ చేయించుకుంటున్నారు. ఎఫ్‌సీ చేయించుకునేందుకు వాహనాల నుంచి అదనంగా ఎలాంటి రుసుం వసూలు చేయలేదు. ఆన్‌లైన్‌లోనే వాహన యజమానులు చలానా కట్టుకొని మా ఆఫీసుకు వస్తున్నారు అని ప్రొద్దుటూరు ఆర్టీఓ మురళీధర్ తెలిపారు.

### ఒక్కో వాహనానికి భారీగా అదనపు వసూలు

ప్రొద్దుటూరు ఆర్టీఓ కార్యాలయ పరిధిలో ప్రొద్దుటూరుతో పాటు రాజుపాళెం, చాపాడు, దువ్వూరు, జమ్మలమడుగు, మైలవరం, పెద్దముడియం, ఎర్రగుంట్ల మండలాలు ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో విద్యా సంస్థల బస్సులు సుమారు 340 వరకు ఉన్నాయి. ఎఫ్‌సీ చేయించేందుకు ప్రభుత్వ ఫీజు సీటింగ్ సామర్థ్యాన్ని బట్టి రూ.800–950 వరకు ఉంది. అయితే ఎఫ్‌సీ చేయించుకోవడం పూర్తి అయిన తర్వాత స్థానికంగా ఒక డ్రైవింగ్ స్కూల్‌లో పని చేస్తున్న ఒక వ్యక్తి విద్యాసంస్థల వాహనాల యాజమాన్యాల నుంచి రూ. 2000–2500 వరకు వసూలు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. రవాణాశాఖ అధికారుల పేరుతో అతను ఈ వసూళ్లకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. మరి ఈ మొత్తాన్ని ఎవరికి ఇస్తున్నాడో తెలియాల్సి ఉంది. ఈ అదనపు వసూళ్ల కోసమే పాఠశాల యాజమాన్యాలను ఎఫ్‌సీ చేయించుకోమని పరుగులు పెట్టించినట్లు తెలుస్తోంది.

### బాలుడికి పాము కాటు


బాలుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ

జమ్మలమడుగు : పెద్దముడియం మండలం చిన్న పసుపల గ్రామానికి చెందిన పూజిత్ రెడ్డి అనే విద్యార్థికి పాము కాటు వేసింది. వెంటనే గుర్తించిన కుటుంబ సభ్యులు బాలుడిని జమ్మలమడుగు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పూజిత్‌రెడ్డి తల్లి, నాయనమ్మలు గ్రామంలో గ్రామీణ ఉపాధి హామీ పనుల కోసం వెళ్లారు. ఇంటి వద్ద ఒక్కడు ఉండలేక పూజిత్ రెడ్డి సైతం తల్లితోపాటు ఉపాధిహామీ పనులకు వెళ్లాడు. పనులు చేస్తుండగా పొలంలో ఉన్న విష పురుగు బాలుడిని కాటు వేసింది. వెంటనే హుటాహుటిన ప్రభుత్వాసుపత్రికి తీసుకుని వచ్చి వైద్యం చేయించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, గిరిధర్‌రెడ్డిలతోపాటు గ్రామ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డిలు ఆసుపత్రిలో ఉన్న బాలుడిని పరామర్శించారు. అనంతరం ఆరోగ్య పరిస్థితి గురించి చిన్నపిల్లల వైద్యుడు సుధాకర్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. రోగ్య పరిస్థితి నిలకడగా ఉందని డాక్టర్ వివరించారు.

### జైలులో క్షుణ్ణంగా తనిఖీలు చేస్తాం

కడప అర్బన్ : కడప కేంద్ర కారాగారంలోకి వెళ్లే ప్రతి వస్తువును, విధులకు హాజరయ్యే ప్రతి అధికారి, సిబ్బందిని క్షుణ్ణంగా తనిఖీ చేస్తామని కడప కేంద్ర కారాగారం ఇన్‌చార్జి సూపరింటెండెంట్, డిప్యూటీ సూపరింటెండెంట్ కమలాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. 'సాక్షి'లో 'కారాగారంలో కాసుల కుక్కుర్తి' అనే శీర్షికన ప్రచురితమైన వార్తపై ఆయన స్పందించారు. తనిఖీల సమయంలో దొరికిన సెల్ ఫోన్‌లు పోలీస్ స్టేషన్‌లో అప్పగించడంతో పాటు బాధ్యులైన వారిపై చర్యల కోసం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. పెట్రోలు బంకులో అన్ని లావాదేవీలు ఆన్‌లైన్‌లో కొనసాగుతాయన్నారు.

## తొమ్మిది మంది ఆర్టీసీ కానిస్టేబుళ్లపై వేటు

- ఇప్పటికే వీఅండ్‌ఎస్‌ఓ సస్పెన్షన్
- అవినీతి ఆరోపణల నేపథ్యంలో ఉన్నతాధికారుల చర్యలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : మనిషికి కళ్లు, చెవులు ఎంత ముఖ్యమో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కూడా ఒక సంస్థకు అంతే ముఖ్యం. ప్రధానంగా ఆర్థిక లావాదేవీలు ఎక్కువగా జరిపే సంస్థల్లో అవినీతి అక్రమాలకు తావు లేకుండా విజిలెన్స్ విభాగం అప్రమత్తంగా ఉండాలి. కానీ, ఏపీఎస్ ఆర్టీసీలో అందుకు విరుద్ధంగా నడుస్తోంది. అయితే కంచే చేను మేసిన విధంగా విజిలెన్స్ విభాగమే అవినీతి కూపం అయిపోయింది. కడప జోన్‌లో పనిచేస్తున్న వీఎస్‌అండ్‌ఎస్‌ఓ డబ్బుల కోసం వేధిస్తున్నారని ఆర్టీసీ కానిస్టేబుళ్లు ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు. కొంతమంది రాతపూర్వకంగా ఫిర్యాదు చేయడంతో అవినీతి బాగోతం వెలుగులోకి వచ్చింది. రాష్ట్ర ఉన్నతాధికారులు ఓ అధికారిచేత విచారణ చేయించి ఇప్పటికే కడప వీఅండ్‌ఎస్‌ఓ ముజుబుర్ రెహ్మాన్‌పై వేటు వేసింది. అయితే ఆయనకు సహకరించిన కడప జోన్‌లో పనిచేస్తున్న పోలీసులపై కూడా వేటు వేశారు. పులివెందుల డిపోలో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కేవీ రెడ్డి, కడప వీఅండ్ ఎస్‌ఓ కార్యాలయంలో పనిచేస్తున్న ఎన్‌పీఎల్‌ఎన్‌వీ ప్రసాద్, గుత్తి డిపోలో పనిచేస్తున్న జీవీ గిరి రమణ, నంద్యాల డిపోలో పనిచేస్తున్న ఎ.మనోహర్, కేఆర్‌సీ రెడ్డి, కడప బస్టాండులో పనిచేస్తున్న ఆర్‌ఎంఎస్ నాయక్, కడప జోనల్ వర్క్‌షాప్‌లో పనిచేస్తున్న పి.శ్రావణ్‌కుమార్, రాజంపేట డిపోలో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న శంకరయ్యలకు సస్పెన్షన్ లెటర్లు అందజేశామని డిప్యూటీ చీఫ్ పర్సనల్ మేనేజర్ గజలక్ష్మి తెలిపారు. కదిరి డిపోలో పనిచేస్తున్న కానిస్టేబుల్ యూఎన్‌ఎస్ రెడ్డికి ఆర్డర్ కాపీలు అందజేయాల్సి ఉంది.

## వెరిటాస్ సైనిక్ స్కూల్‌కు భారత ప్రభుత్వం అనుమతి

- దేశ రక్షణకు విద్యార్థులను తయారు చేయడమే వెరిటాస్ లక్ష్యం
- వెరిటాస్ సైనిక్ స్కూల్ చైర్మన్ డాక్టర్ బి.శేషారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న వెరిటాస్ సైనిక్ స్కూల్ చైర్మన్ డాక్టర్ బి.శేషారెడ్డి

తిరుపతి కల్చరల్ : తిరుపతిలో గత 22 ఏళ్లుగా బీఎస్‌ఆర్ విద్యాసంస్థల ద్వారా క్రమశిక్షణతో కూడి విద్యతో పాటు వేలాది మంది విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ ఇటు విద్యార్థుల ఉన్నతికి, దేశ రక్షణకు అందిస్తున్న సేవలను గుర్తించి భారత ప్రభుత్వం మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్ సైనిక్ స్కూల్ అనుమతి పొందిందని వెరిటాస్ సైనిక్ స్కూల్ చైర్మన్ డాక్టర్ బి.శేషారెడ్డి తెలిపారు. శనివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ విద్యాసంస్థల ద్వారా ఇప్పటికే సుమారు 20 వేల మంది విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందించడంతో పాటు 6 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించామని తెలిపారు. అందరి సహకారంతో భారత రక్షణ దళానికి ఎంతో మంది సైనికులను అందించేలా కృషి చేశామన్నారు. వెరిటాస్ సైనిక్ స్కూల్ స్థాపించినప్పటి నుంచి అనుభజ్ఞులైన వారిచే అత్యుత్తమమైన విద్యాప్రమాణాలతో విద్యార్థులకు విద్యతో పాటు శారీరక, మానసిక, మానవీయ విలువలతో కూడిన విద్యను అందిస్తూ ఆదరణ పొందామన్నారు. భారత ప్రభుత్వం గుర్తింపుతో మరింత బాధ్యతగా దేశ భద్రత కోసం వెరిటాస్ సైనిక్ స్కూల్ ముందడుగు వేస్తోందన్నారు. దేశానికి అవసరమైన విద్యను యువతకు డిఫెన్స్ రంగాలలో ఎన్‌డీఏ, టీఈఎస్ వంటి ఉత్తమమైన ఉద్యోగ అవకాశాలను కేవలం 17 ఏళ్ల వయస్సులోనే పొందే విధంగా తీర్చిదిద్దాలని సంకల్పించామన్నారు. ఇకపై ఆలిండియా సైనిక్ స్కూల్ ఎంట్రన్స్ పరీక్షల ద్వారా కౌన్సెలింగ్ నిర్వహించి సీట్ల కేటాయింపు జరుగుతుందన్నారు. విద్యాసంస్థలో ప్లస్–1 ఇంటర్మీడియట్‌తో స్పెషల్ ఎన్‌డీఏను ప్రారంభిస్తున్నామని, ఈ అవకాశాన్ని ఆసక్తి ఉన్నవారు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో వెరిటాస్ సైనిక్ స్కూల్ డైరెక్టర్లు బి.శ్రీకర్‌రెడ్డి, బి.సందీప్‌రెడ్డి పాల్గొన్నారు.



## పేడ నీళ్లు చల్లే విషయంలో ఘర్షణ


ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

జమ్మలమడుగురూరల్ : ఇంటి ముందు పేడ నీళ్లు చల్లే విషయంలో జరిగిన చిన్న చిన్న పాటి గొడవ పెద్దదై పరస్పరం దాడులు చేసుకునేంత వరకు వెళ్లింది. మండల పరిధిలోని పి.బొమ్మేపల్లి గ్రామంలో జరిగిన ఈ సంఘటన వివరాలు పోలీసుల కథనం మేరకు ఇలా ఉన్నాయి. బొగ్గు గురులక్ష్మి తన ఇంటి ముందు పేడ నీళ్లు చల్లుకుంటూ ఉండగా కొన్ని నీళ్లు పక్కన నివాసం ఉంటున్న రాజచౌడయ్య ఇంటి వద్ద పడ్డాయి. ఈ విషయమై ఇరువురి మధ్య తీవ్ర స్థాయి వాగ్వాదం జరిగింది. దీంతో ఇరు కుటుంబాల వారు ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. ఈ దాడుల్లో ఇరు కుటుంబాలకు చెందిన వారు గాయపడ్డారు. గాయపడి వారిలో బొగ్గు నాగ అంజి, మహేష్, నాగేంద్ర, మల్లికార్జున, రామాంజనేయులు, గురులక్ష్మి, మరోవర్గంలో గూడెంచెరువు రాజ చౌడయ్య, సోమశేఖర్, పెద్ద చౌడప్ప, రమణమ్మ, రామ చౌడయ్య ఉన్నారు. రాజ చౌడయ్యకు తలపై బలమైన గాయం కావడంతో మెరుగైన చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరుకు తరలించారు

## అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

నాలుగు రోజుల క్రితం చనిపోయినట్లు భావిస్తున్న పోలీసులు


ఓబుళరెడ్డి (ఫైల్)

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని వైఎంఆర్ కాలనీలో ఉన్న సాయికుటీర్ రోడ్డులో మార్తల ఓబుళరెడ్డి అలియాస్ గిరి (47) అనే వ్యక్తి తన ఇంట్లోనే అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. త్రీ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఓబుళరెడ్డి కాంట్రాక్టర్‌గా పని చేసేవాడు. అతనికి 2005లో వివాహమైంది. ఒక కుమార్తె కూడా ఉంది. అతను మద్యానికి బానిసయ్యాడనే కారణంతో ఏడేళ్ల క్రితం భార్య విడాకులిచ్చింది. నాటి నుంచి తల్లి సరస్వతితో కలిసి ఇంట్లో ఉంటున్నాడు. తల్లికి క్యాన్సర్ వ్యాధి ఉండటంతో చికిత్స కోసం వారం రోజుల క్రితం కర్నూలు ఆస్పత్రిలో చేర్పించారు. ఓబుళరెడ్డి మృతదేహం పక్కనే మద్యం సీసాలు ఉన్నాయి. మద్యం మత్తులో ఉన్న అతను మంచంపై నుంచి కింద పడి ఎండ తాపానికి తట్టుకోలేక మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. శనివారం రాత్రి ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. త్రీ టౌన్ సీఐ గోవిందరెడ్డి, ఎస్‌ఐ వెంకటరెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. ఓబుళరెడ్డి మృతి చెందిన విషయాన్ని హైదరాబాద్‌లో ఉంటున్న సోదరికి పోలీసులు సమాచారం అందించారు. నాలుగు రోజుల క్రితం అతను మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. కుటుంబ సభ్యుల నుంచి ఫిర్యాదును తీసుకున్న అనంతరం ఆదివారం ఘటనా స్థలంలోనే మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించనున్నట్లు సీఐ తెలిపారు.

# అన్నమయ్య కోసం.. కదిలిన వారసులు!

- ఊరూరా అన్నమయ్య.. ఇంటింటా అన్నమయ్య
- ఉభయ తెలుగు రాష్ట్రాలలో సంకీర్తనల సేవ
- ఏటా అన్నమయ్య వర్ధంతి, జయంతి, ఆరాధనోత్సవాలు
- నడుం బిగించిన అన్నమయ్య 12వ తరం వారసులు


వైజాగ్‌లో అన్నమయ్య వర్ధంతి ఉత్సవాలలో భాగంగా అన్నమయ్యలో సంకీర్తన సేవ దృశ్యం(ఫైల్)

రాజంపేట : పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యులు సంకీర్తనలు విశ్వవ్యాప్తి చేసేందుకు అన్నమయ్య వారసులు నడుం బిగించారు. ఈ నేపథ్యంలో 2005లో శ్రీ వెంకట అన్నమాచార్య సేవా ట్రస్ట్‌ను ఆగస్టు 30న తిరుపతిలో ప్రారంభించుకున్నారు. ఉభయ తెలుగురాష్ట్రాలలో సంకీర్తనల సేవతో పాటు ఆధ్యాత్మిక, సామాజిక సేవలను కొనసాగిస్తూ వస్తున్నారు. 12వ తరం అన్నమయ్య వారసులు ఏర్పాటుతో ప్రారంభమై ఇప్పుడు 13వ తరం వారసులు కూడా నేటి కార్యక్రమాలను నిర్వహిస్తూ వస్తున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాలలో (ఆంధ్రప్రదేశ్, తెలంగాణా)లో అన్నమయ్య సేవా సంస్కృతి అన్న పేరుతో ప్రసిద్ధి చెందింది. ఎన్నో కార్యక్రమాలను నిర్వహించారు.

**ఊరూరా అన్నమయ్యలో..**

ఊరూరా అన్నమయ్య కార్యక్రమంలో భాగంగా ప్రతి ఆలయాలకు వెళ్లి సాంస్కృతిక, సంగీత కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. విష్ణుపురాణం, హనుమాన్ చాలీసా, నగర సంకీర్తన కార్యక్రమాలు చేపడుతున్నారు. అన్నమయ్య పల్లకీసేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

అన్నమాచార్య సంకీర్తనలు, కోలాటాలలో ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. సామాజికసేవ, ఆధ్యాత్మికసేవ, అన్నమయ్య సంకీర్తన ప్రచార సేవ, సాంస్కృతిక సేవ, భక్తిసేవ, సంగీతసేవ, పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా అన్నమయ్య సంకీర్తనలు నేర్పిస్తున్నారు. కోలాటంలో కూడా శిక్షణ ఇస్తున్నారు. పిల్లలకు స్తోత్ర మంజరి పై కార్యక్రమాలు నిర్వహించి ప్రపంచ రికార్డు సాధించారు.

**ఏటా అన్నమయ్య ఆరాధనోత్సవాలు..**

ప్రతి ఏటా అన్నమయ్య ఆరాధనోత్సవాలు నిర్వహిస్తున్నారు. అలాగే జయంతి, వర్ధంతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. టీటీడీ నిర్వహించే అన్నమయ్య జయంతి, వర్ధంతి ఉత్సవాలకు అన్నమయ్య 12 వతరానికి చెందిన హరిస్వామి విధిగా పాల్గొంటున్నారు. ఈ ట్రస్ట్ చైర్మన్‌గా తాళ్లపాక రామ్‌చరణ్, వైస్‌చైర్మన్‌గా తాళ్లపాక కృష్ణధీరజ్, సెక్రటరీగా తాళ్లపాక గౌరీ ప్రసన్న, ఉభయ రాష్ట్రాల డైరెక్టర్లుగా కొఠారి సునీత, మీనాక్షి అన్నమయ్యలున్నారు.

**సామాజిక సేవలోనూ..**

ప్రతి సంవత్సరం మార్చి నుంచి జూన్ వరకు వేసవిలో విశాఖ, కర్నూలు నగరాలలో భక్తులకు దాహం తీర్చేందుకు మంచినీళ్లు, మజ్జిగ వితరణ కేంద్రాలను ఏర్పాటుచేసి అన్నమయ్యసేవను అందిస్తున్నారు. అలాగే పల్స్‌పోలియో, మెడికల్ క్యాంప్, రక్తదానశిబిరం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం కొనసాగుతోంది. అన్నమయ్య బాటలో ఆయన వారసులు ముందుకెళుతున్నారు.

**12న అన్నమయ్య జయంత్యుత్సవాల్లో వారసులు..**

ఈనెల 12న జరిగే అన్నమయ్య జయంత్యుత్సవాల్లో అన్నమయ్య వారసులు పాల్గొంటారు. వారిని టీటీడీ గౌరవిస్తుంది. అన్నమాచార్యుల జన్మస్థలి తాళ్లపాకలో ఊరూరా అన్నమయ్య..ఇంటింటా అన్నమయ్య కార్యక్రమాన్ని ప్రారంభించారు.


### అన్నమాచార్యుని వంశీయులు కావడం పూర్వజన్మ సుకృతం



అన్నమాచార్యుని వారసులు కావడం మా పూర్వజన్మ సుకృతం. పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యులు చూపిన మార్గంలో మేము నడుచుకుంటున్నాము. శ్రీవారిసేవ చేసుకునే మహాభాగ్యం దక్కింది. ఆధ్యాత్మిక, సామాజిక సేవలను చేస్తున్నాము. అన్నమయ్య కీర్తనలు విశ్వవ్యాప్తం చేసేందుకు. ఊరూరా అన్నమయ్య.. ఇంటింటా అన్నమయ్య కార్యక్రమాన్ని చేపట్టాము. టీటీడీ, భక్తుల సహకారంతో విజయవతంగా నిర్వహిస్తున్నాము.

– తాళ్లపాక హరినారాయణచార్యులు, తిరుమల

### నలుదిశలా అన్నమయ్య సంకీర్తనలకు విస్తృత ప్రచారం



తాళ్లపాక అన్నమాచార్యుల సంకీర్తనలకు విస్తృత ప్రచారం కల్పిస్తున్నాం. ఊరూరా అన్నమయ్య..ఇంటింటా అన్నమయ్య కార్యక్రమాలను ఏపీ, తెలంగాణలో దిగ్విజయంగా నిర్వహిస్తున్నామంటే భక్తులు, టీటీడీ సహకారం మరువలేనిది.

– తాళ్లపాక గౌరీ ప్రసన్న, ట్రస్ట్ సెక్రటరీ, తిరుమల